సాక్షి జగిత్యాల
శనివారం । 20 । మే । 2023



రేషన్ డీలర్ల నిరసన

జగిత్యాల: గౌరవ వేతనం, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో రేషన్ డీలర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.



భక్తులు లేక వెలవెల

వేములవాడ: శుక్రవారం అమావాస్య కావడంతో రాజన్న దర్శనానికి భక్తులు రాలేరు. భక్తులు లేక ఆలయం వెలవెలబోయింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0/28.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గి ఉక్కపోతగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భరణి నక్షత్ర పూజలు



పూజలు అందుకుంటున్న యమధర్మరాజు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీయమధర్మరాజు ఆలయంలో శుక్రవారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాలశర్మల మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. వివిధ పొంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో బుగ్గారం జెడ్పీటీసీ బాదినేని రాజేందర్, దేవస్థానం సిబ్బంది, రెనోవేషన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు ఉచిత వైద్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: కరీంనగర్ సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఉచిత వైద్యం అందిస్తామని ఎస్పీ భాస్కర్ తెలిపారు. సన్‌షైన్ ఆస్పత్రి, కరీంనగర్, పోలీసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వైద్య శిబిరం ప్రచార పోస్టర్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. గుండె సంబంధిత, ఆర్థో తదితర సమస్యలో బాధపడే వారి కోసం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్, ఐఎంఏ అధ్యక్షుడు తాటిపాముల సురేశ్‌కుమార్, సన్‌షైన్ డాక్టర్ అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపై పూజలు



సన్మానిస్తున్న ఏఈవో బుద్ధి శ్రీనివాస్

మల్యాల(చొప్పదండి): ఆంధ్రప్రదేశ్ విప్, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీసమేతంగా కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు, అధికారులుశాలువాతో సన్మానించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు రామకృష్ణ, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలనే డిమాండ్‌తో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం బంద్ నిర్వహించారు. హోటళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. విశ్వహిందూ పరిషత్ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎస్సైపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నాయకులు సతీశ్, మారుతి, బత్తుల శ్రీనివాస్, గడ్డం మహేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



అదరవేని హారిక

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన అదరవేని హారిక ఈనెల 18న జగిత్యాల ఓల్డ్ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కందుకూరి అజయ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి 26వ తేదీ వరకు సూర్యాపేటలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో హారిక పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. హారికను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, సర్పంచ్ బోనగిరి నారాయణ, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, హెచ్‌ఎం సునీల్‌కుమార్ అభినందించారు.

రోజుకో ప్రమాదం

రోడ్డు ప్రమాదాల్లో నిత్యం ఒకరి మృతి



తిమ్మాపూర్ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం

- ఆరేళ్లలో సుమారు 980మంది మృత్యువాత
- ఆందోళన కలిగిస్తున్న రోడ్డు ప్రమాదాలు
- తీవ్రగాయాలతో క్షతగాత్రుల నరకయాతన
- వీధినపడుతున్న వందలాది కుటుంబాలు

నాన్న లేడు.. అమ్మలేదు



- నాన్న నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతూ పదేళ్ల క్రితమే చనిపోయిండు. అప్పుడు మేం చిన్నోళ్లం. తమ్ముడు, నేను, అమ్మ. ముగ్గురం ఉండేవాళ్లం. అమ్మ శ్యామల. కూలీ పనులు చేస్తూ మమ్మల్ని సాదుకుంది. కానీ, మూడు నెలల కింద మా అమ్మ స్కూటీమీద పోతుండగా జగిత్యాల మండలం చెర్లపల్లి శివారులో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. అంతే.. తీవ్రగాయాలతో అమ్మ చనిపోయింది. అమ్మానాన్నను కోల్పోయినం. ఏ బాధ కలిగినా వాళ్లే గుర్తుకు వస్తరు. ఏం జేసుడో తెలుస్తలేదు. నేను ఇంటర్ చదువుతున్న. త మ్ముడు ఎనిమిదో తరగతి చదువుతున్నడు. మా అమ్మమ్మ దగ్గర ఉంటున్నం.

– పూదరి గంగమారుతి, మోరపల్లి

జగిత్యాలక్రైం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీసు, రవాణా శాఖ అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నా నియంత్రణలోకి రావడం లేదు. వాహనదారుల నిర్లక్ష్యం, నిబంధనలు అతిక్రమించడం, మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం తదితర కారణాలు ప్రమాదాలకు కారణమని అధికారులు వివరిస్తున్నారు. మైనర్లు, డ్రైవింగ్ రానివారు కూడా వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. మరోవైపు.. వాహనాలకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక సాయం అందడంలేదు. ఫలితంగా వందలాది కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డు పడుతున్నాయి.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు..

- రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోంది.
- నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధిస్తోంది.
- మద్యం తాగి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు తరచూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తోంది.
- మద్యం తాగినట్లు తేలితే జరిమానా విధించడంతోపాటు కోర్టులోనూ హాజరు పర్చుతోంది.
- బ్లాక్ పాయింట్స్ వద్ద హెచ్చరిక, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తోంది.
- స్పీడ్‌బ్రేకర్లు, బారికేడ్స్, రెయిలింగ్స్ పెడుతోంది.

వేగానికి కళ్లెం..

- రవాణా, పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రధానంగా వాహనాల వేగంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులపై స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేస్తోంది. అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానా విధిస్తోంది.
- రోడ్ల విస్తీర్ణం, పనితీరును బట్టి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. భారీ వాహనాలు గంటకు 60 కి.మీ., సాధారణ వాహనాలు 80కి.మీ. వేగం మించొద్దు. కానీ చాలామంది వాహనదారులు నిబంధనలు అతిక్రమించి అతివేగంగా వెళ్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పటిష్ట చర్యలు



జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నాం. ప్రధాన రోడ్ల వెంట హెచ్చరిక, సైన్‌బోర్డులు ఏర్పాటు చేశాం. వేగ నియంత్రణ కోసం స్పీడ్‌గన్‌లు ఏర్పాటు చేశాం. వాహనాల వేగంతో తలెత్తే సమస్యలపై తరచూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– భాస్కర్, ఎస్పీ

2018 నుంచి 2023 మే 16వ తేదీ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	తీవ్రగాయాలు	స్వల్పగాయాలు	మృతులు
2018	450	147	272	216
2019	397	131	221	136
2020	363	151	186	160
2021	398	191	184	204
2022	391	182	189	200
2023(ఇప్పటివరకు)	138	142	102	64

'పెద్ద'గా ప్రయోజనం లేదు



- రూ.2 వేల నోట్ల రద్దుపై జిల్లావాసుల మిశ్రమ స్పందన

జగిత్యాల: రూ.2వేల నోట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో చలామణిలో ఉన్న రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకుల్లో ఖాతాదారులకు రూ.2 వేల నోట్లు ఇవ్వొద్దని ఆదేశించింది. ఈ నోట్లు కలిగిఉన్న వారు ఈనెల 23 నుంచి సెప్టెంబర్ 30వ తేదీలోపు బ్యాంకులు, ఆర్‌బీఐ కార్యాలయాల్లో మార్చుకోవచ్చని సూచనలు చేసింది. 2016 నవంబర్ 8న రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేయడంతో జిల్లావాసులు చాలాఇబ్బందులకు గురయ్యారు. రూ.2వేల పెద్దనోట్ల రద్దుతో సామాన్యులకు పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉండవని పలు వర్గాల ప్రజలు అభిప్రాయపడ్డారు. బ్యాంకులకు ఇబ్బందిగా ఉంటుందని మరికొందరు చెప్పారు. ఎవరేమంటున్నారంటే..

పేదలకు మేలు



రూ.2 వేల నోట్ల చలా మణి ఉపసంహరించుకోవడంపై ప్రజలకు మేలు జరుగుతుంది. అత్యధిక శాతం రూ.2 వేల నోట్లు బ్లాక్ అయ్యాయి. ఎక్కడా చలామణిలో లేవు. నోట్ల ఉపసంహరణతో పేదవారికి మేలు జరుగుతుంది.

– మచ్చ శంకర్, ఉపాధ్యాయుడు, జగిత్యాల

ప్రజలకు ఇబ్బందులు



ప్రస్తుతం డిజిటల్ యుగమే నడుస్తుంది. రూ.2 వేల నోట్లు ఎందుకు ఉపసంహరించుకున్నారు? అయినా ఆర్‌బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. బ్లాక్‌మనీ బయటకు వస్తుంది. ప్రస్తుతం రూ.2 వేల నోట్ల చలామణి చాలా వరకు తగ్గిపోయింది. కానీ ప్రభుత్వం రూ.2 వేల నోట్లు తయారు చేసి మళ్లీ రద్దు చేయడం పేదలకు ఇబ్బందికరంగా ఉంటుంది.

– కమటాల శ్రీను, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, జగిత్యాల

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



గతంలో అకస్మాత్తుగా రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేయడంతో పేదలు చాలాఇబ్బందులకు గురయ్యారు. బ్యాంకుల వద్ద గంటల తరబడి నిలబడ్డారు. రద్దు చేసినప్పటికీ వారికి ఇబ్బందులు లేకుండా చూడాలి. రూ.2 వేల నోట్ల రద్దు చాలా మంచి నిర్ణయం. చాలా బ్లాక్‌గా మారిపోయింది.

– కల్యాణ్, మెడికల్ బిజినెస్, జగిత్యాల

రద్దు నిర్ణయం మంచిదే



రూ.2 వేల నోట్ల రద్దు మంచి నిర్ణయమే. రూ.2 వేల నోట్ల ప్రింటింగ్‌ను ఎప్పుడో ఆపేశారు. ప్రస్తుతం ఉన్న రూ.2 వేల నోట్ల చలామణి మొత్తం తగ్గిపోయింది. మొత్తం బ్లాక్‌గా మారిపోయింది. ఈ రద్దు నిర్ణయంతో రూ.2 వేల నోట్లు బయటకు వస్తాయి.

– మాడిశెట్టి నవీన్‌కుమార్, అథరైజ్డ్ ఇన్‌కమ్‌టాక్స్ ప్రాక్టీషనర్, జగిత్యాల

యంత్రాల తరలింపు

వెల్గటూర్(ధర్మపురి): స్తంభంపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలం చదును చేసేందుకు తెచ్చిన రెండు యంత్రాలను శుక్రవారం వేరే చోటుకు తరలించారు. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన చేపట్టారు. ప్రతిపాదిత స్థలం నుంచి తక్షణమే యంత్రాలు తరలించాలని, పరిశ్రమ పనులు నిలిపివేసి, ఫ్యాక్టరీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చివరికి శుక్రవారం ప్రతిపాదిత స్థలం నుంచి యంత్రాలను తరలించడంతో తమ పోరాటం ఫలితమే ఇది అని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే, మరమ్మత్ కోసమే తాత్కాలికంగా మిషన్లు తరలించినట్లు సమాచారం.

పులిసంచారం లేదు

కథలాపూర్(వేములవాడ): భీమారం మండలం గోవిందారం, రాజలింగంపేట అడవుల్లో పులి, సింహం సంచరిస్తుందని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, ప్రజలు నమ్మవద్దని గోవిందారం డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోవిందారం శివారులోని అడవుల్లో పులి సంచరిస్తుందని కొందరు, మరికొందరు సింహం సంచరిస్తుందని సోషల్ మీ డియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇ ది అవాస్తవమని వెల్లడించారు. ప్రజలు భయాందోళనకు గురికావద్దని ఆయన సూచించారు.

టీచర్ శిక్షణ.. నిధుల భక్షణ!

- సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనంలో తర్ఫీదు
- ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌తో పెరిగిన డిమాండ్
- అవసరానికి మించి సిబ్బందిని నియమించారని ఆరోపణలు
- ఏటా ఒకే బృందంతో ట్రైనింగ్ ఇస్తున్నారని ఫిర్యాదులు
- చక్రం తిప్పుతున్న నేత?

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీసీ) ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకునే వారికి పునాదిలాంటిది. హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్(హన్మకొండ) ఉమ్మడి జిల్లాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న కోర్సు ఇది. ఇటీవల ప్రారంభమైన టీటీసీసీ–2023 బ్యాచ్‌లో వందలాది మంది అభ్యర్థులు చేరారు. సంప్రదాయ ఉపాధ్యాయ శిక్షణతోపాటు సంగీతం, టైలరింగ్, చిత్రలేఖనం వంటి కోర్సుల్లోనూ ఇక్కడ నైపుణ్యాలు నేర్పిస్తారు. కరీంనగర్‌లోని శిక్షణ కేంద్రంలో 500 మందికి పైగా అభ్యర్థులు శిక్షణ పొందుతుండగా.. అవసరానికి మించిన ఉపాధ్యాయులు, సిబ్బంది ఇక్కడ పనిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు తనకు దగ్గరున్న వారికే శిక్షణ విధులు కేటాయించేలా చక్రం తిప్పాడని, దీని వెనుక లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు.

ఎక్కడ నేర్పిస్తున్నారు?

ఈ కోర్సులో టీచింగ్ కెరీయర్‌గా ఎంచుకునే వారందరికీ ఉపయుక్తంగా ఉంటుంది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ (టీటీసీసీ) ఆధ్వర్యంలో ఈ టీటీసీసీ–2023 (టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు)కు 42 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. మే ఒకటో తేదీ నుంచి జూన్ 11వరకు కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దంన్‌గర్‌వాడీ పాఠశాల వేదికగా మంకమ్మతోటలో నిర్వహిస్తున్నారు. కుట్లు, చిత్రలేఖనం, సంగీతంలో శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్‌లో 246 మంది, డ్రాయింగ్‌లో 293 మంది, మ్యూజిక్‌లో 14 మంది మొత్తం 553 మంది శిక్షణ పొందుతున్నారు. పదో తరగతి లేదా లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత ఉండి 18 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగి ఉన్న వారు కోర్సులో చేరేందుకు అర్హులు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలతోపాటు ఆసిఫాబాద్, గజ్వేల్, చెన్నూరు, గోదావరిఖని, మంథని, ఆదిలాబాద్, సిద్దిపేట, మంచిర్యాల, జన్నారం తదితర ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు ఇందులో శిక్షణ పొందుతున్నారు. 2016, 2017, 2018 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.



శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

సిబ్బంది ఎక్కువయ్యారని ఆరోపణలు

ఈ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు అవసరానికి మించి ప్రభుత్వ టీచర్లకు విధులు కేటాయించారని, ఇందులో ఈఎల్స్ ఎన్‌క్యాష్‌మెంట్ చేసుకునే కుట్ర దాగి ఉందని పలువురు సీనియర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. తొలుత కోర్సు బోధనకు 22 మందిని తీసుకున్నారు. బోధన సిబ్బందికి పీజీ, ఎంఈడీ అర్హత తప్పనిసరి. ఈ అర్హతలు లేకున్నా.. కొందరిని ఎంపిక చేయడం వివాదాస్పదంగా మారింది. వెంటనే నాలిక కరుచుకున్న అధికారులు తొమ్మిదిమందిని తప్పించారు. ప్రస్తుతం డైట్ కాలేజీలో పనిచేసిన 13 మంది ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు మరో ఐదుగురు, డ్రాయింగ్ కోసం ఆరుగురు, టైలరింగ్ కోసం ఒకరు, మ్యూజిక్ టీచర్, బిల్డింగ్ ఇన్‌చార్జి, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీస్ వర్క్ కోసం ఎనిమిదిమంది, ఐదుగురు పీఈటీలు, ఆరుగురు అటెండర్లు ఉన్నారు. వీరితో పాటు ఒక కోర్సు డైరెక్టర్.. కోర్సు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఎవరా నేత?

గతంలో కోర్సు నిర్వహణకు ఇంతమంది సిబ్బంది లేరని, ఇప్పుడు అవసరానికి మించి కేటాయించడం వెనక ఉద్దేశం ఏమిటని తోటి ప్రభుత్వ ఉపాధ్యాయులే నిలదీస్తున్నారు. ప్రతీసారి ఈ సిబ్బంది ఎంపికలో ఓ ఉపాధ్యాయ సంఘం నేత చక్రం తిప్పుతున్నాడని, ఆయన ఏటా తన మనుషులుగా ముద్రపడ్డ వారికే డ్యూటీలు వేయిస్తున్నారని మండిపడుతున్నారు. పీఈటీలు, ఆఫీస్ సబార్డినేటర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు అవసరానికి మించి ఉన్నారని, దీని వెనక లీవుఎన్ క్యాష్‌మెంట్ కుంభకోణం దాగి ఉందని ఆరోపిస్తున్నారు. అడ్మిషన్లు, బిల్డింగ్ ఇన్‌చార్జులుగా ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తుండటమే ఇందుకు నిదర్శమని ఆరోపిస్తున్నారు. డీఈవో, డైట్, డీసీఈబీలలో నాన్ టీచింగ్ స్టాఫ్‌ని సద్వినియోగం చేసుకోకుండా ఉపాధ్యాయులను ఆ పోస్టులో ఎలా నియమిస్తారని, అభ్యర్థుల సంఖ్య పెరగనప్పుడు అదనపు సిబ్బంది దేనికోసమని ప్రశ్నిస్తున్నారు. దీనిపై కోర్సు కో ఆర్డినేటర్ లక్ష్మారెడ్డిని వివరణ కోరగా.. అభ్యర్థుల నిష్పత్తిగా తగినట్టుగానే సిబ్బంది కేటాయింపు జరిగిందని, అదనంగా ఎవరూ లేరని సమాధానం ఇచ్చారు.

విదేశాల్లో ఉద్యోగాలు

జగిత్యాల: విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారికోసం కరీంనగర్‌లో ఈనెల 23న అవగాహన సదస్సు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ శుక్రవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసినవారికి జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. యూఏఈ దేశంలో క్లీనర్, బ్లాస్టింగ్, పెయింటర్ ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలో సీఎన్‌సీ మిషనిస్ట్, పోలండ్ దేశంలో వెల్డర్, ఫిట్టర్, మలేషియాలో టెక్నికల్ సూపర్‌వైజర్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో కరీంనగర్‌లోని ఉజ్వల్ పార్క్ ఎదురుగా ఉన్న టాస్క్ రీజినల్ సెంటర్ ఐటీ టవర్స్‌లో టామ్‌కామ్ వారు నిర్వహించే సమోదు కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు. వివరాలకు 78935 66493 నంబరులో సంప్రదించండి.

ముడుపుల లెక్కింపు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి ముడుపుల ద్వారా రూ.2,11,826 ఆదాయం సమకూరినట్లు ఆలయ చైర్మన్ మారుతి శుక్రవారం తెలిపారు. ఆంజనేయస్వామి దేవస్థానంలో పెద్ద జయంతి సందర్భంగా దీక్షస్వాములు ద్వారా వచ్చిన ముడుపులు శుక్రవారం విప్పగా ఈ ఆదాయం సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

పొరుగు జిల్లాలకు మన ధాన్యం



కొనుగోళ్లపై కలెక్టర్ అనురాగ్ జయంతి ఆరా

సిరిసిల్ల: జిల్లా రైతులు పండించిన పంటను పొరుగు జిల్లాలకు తరలిస్తున్నారు. జిల్లాలో బాయిల్డ్ రైస్‌మిల్లులు 30 ఉండగా.. ధాన్యం నిల్వకు స్థలం లేక పొరుగు జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 257 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 16,825 మంది రైతుల వద్ద 1,04,883 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం విలువ రూ.216.06 కోట్లు కాగా.. 8,774 మంది రైతులకు రూ.86.90 కోట్లు చెల్లించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జిల్లాలో మూడు సెక్టార్లలో 300 లారీలను ధాన్యం తరలింపునకు వినియోగిస్తున్నట్లు వివరించారు. లారీలను అన్‌లోడ్ చేయడంలో జాప్యమవుతుందని, ఎండ తీవ్రతతో హమాలీలు ఎక్కువ సేపు పనిచేసే పరిస్థితి లేక ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యమవుతుందన్నారు. సెక్టారుకు వంద లారీల చొప్పున పంపుతున్నట్లు వివరించారు. కొన్ని ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న ట్రాక్టర్లను సైతం ధాన్యం రవాణాకు వినియోగించుకుంటున్నారన్నారు. కొద్దిగా ఆలస్యమైన పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేస్తామని జితేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

రామడుగు : మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ అయింది. గోపాల్‌రావుపేటకు చెందిన బండారి మానస శుక్రవారం తెల్లవారుజామున బాత్రూమ్‌కు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ప్రహరీ దూకి మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. పుస్తెలతాడు విలువ రూ.86,500 ఉంటుందని పోలీసులు తెలి పారు. భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం : బావిలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. కరీంనగర్ రూరల్ సీఐ విజ్ఞాన్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన ముచ్చె లక్ష్మీ (80) కొన్ని నెలల కింద కిందపడటంతో కాలుకు ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఎటూ కదల్లేకపోవడంతోపాటు తీవ్ర అనారోగ్యానికి గురైంది. శుక్రవారం ఎవరూ లేని సమయంలో చేత బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి మృతి

గోదావరిఖని : రాజీవ్‌నగర్‌కు చెందిన గోలి రాజ్‌కుమార్ (40) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజ్‌కుమార్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

మానకొండూర్: ముంజంపల్లి శివారులో కరీంనగర్ – వరంగల్ ప్రధాన రహదారిపై కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని యువకుడికి గాయాలయ్యాయి. వీణవంక మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన శ్రీధర్ ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ముంజంపల్లి వద్ద కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీధర్‌కు గాయాలుకాగా చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

కల్లూరు ‘ఆదర్శ’ పాఠశాల

- ఏటా ఉత్తమ ఫలితాల సాధన
- ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు సీట్లు
- జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌లకూ ఎంపిక
- పదేళ్లుగా మోడల్‌స్కూల్ విజయపరంపర



కల్లూరు మోడల్ స్కూల్



మోడరన్ ల్యాబ్‌లో విద్యార్థులు

కోరుట్లరూరల్: కల్లూరు మోడల్ స్కూల్(ఆదర్శన పాఠశాల) ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. 2013లో ఆరు, ఏడు, ఎనిమిదో తరగతులతోపాటు ఇంటర్ మొదటి సంవత్సరంతో స్కూల్ ప్రారంభించారు. అప్పట్నుంచి ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే ఉంది. అంతేకాదు.. బాసర ట్రిపుల్ ఐటీలో రికార్డు స్థాయి సీట్లు సాధిస్తోంది. జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌లకు విద్యార్థులు ఎంపికవడం పాఠశాల పనితీరుకు అద్దంపడుతోంది. తద్వారా పది, ఇంటర్ వార్షిక ఫలితాల్లో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందుతోంది. క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ జాతీయస్థాయి పతకాలు సొంతం చేసుకుంటున్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో 36 సీట్లు..

- పదో తరగతిలో 2016–17 బ్యాచ్ నుంచి మొదలుకొని 2021–22 బ్యాచ్ వరకు 36 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి బాసర్ ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందారు.
- అత్యధికంగా 2017–18 విద్యా సంవత్సరం తోపాటు 2018–19 విద్యాసంవత్సరంలో 12 మంది చొప్పున విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందడం గమనార్హం.
- ఏటా పదో తరగతితో అత్యధిక మంది విద్యార్థులు 10 జీపీఏ సాధిస్తున్నారు.
- 2019–20లో 56 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి రికార్డు సృష్టించారు.
- ఇప్పటివరకు 6 బ్యాచుల్లో 116 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మోడల్ స్కూళ్లలో అగ్రస్థానంలో నిలిచారు.
- ఇంటర్ ఫలితాల్లోనూ కార్పొరేటు కళాశాలలకు దీటుగా బైపీసీ, ఎంపీసీ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధిస్తున్నారు.

మెరిట్ ష్కాలర్‌షిప్‌ల సాధనలో రికార్డు..

మెరిట్ ష్కాలర్‌షిప్‌ల సాధనలో కల్లూరు మోడల్ స్కూల్ విద్యార్థులు రికార్డు సృష్టిస్తున్నారు. 2013 నుంచి 2023 వరకు 48 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ ష్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్) సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నారు. ఇప్పటివరకు 30 మంది విద్యార్థులు మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ అడ్ డెవలప్‌మెంట్ (ఎంహెచ్ఆర్‌డీ) ష్కాలర్‌షిప్‌లు పొందారు. మెరిట్ ష్కాలర్‌ఫిప్‌లు పొందేందుకు విద్యార్థులకు స్కూల్‌లోనే మంచిశిక్షణ ఇస్తున్నారు.

ఆటల్లోనూ ప్రతిభ..

- కల్లూరు మోడల్ స్కూల్ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ ఉత్తమ ప్రతిభ చాటుతున్నారు.
- 2019లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో తోట మేఘన జాతీయిస్థాయి కిక్ బాక్సింగ్, వాలీబాల్‌లో తెలంగాణ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించింది.
- తెలంగాణ అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన పోటీల్లో సీహెచ్ మాధురి షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో రజిత పతకం సాధించింది.

రాష్ట్రస్థాయిలో అధిక మంది..

కల్లూరు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ రాష్ట్రంలోనే అత్యధిక మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఒకటిగా నిలిచింది. 286 మంది ఇంటర్ విద్యార్థులు, 786 మంది హైస్కూల్ విద్యార్థులతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో టాప్‌లో నిలిచింది. ఈ పాఠశాలలో చదివిన సర్వరాజ్‌పూర్ గ్రామానికి చెందిన కొక్కుల అఖిల ఛత్తీస్‌గఢ్ ఐఐటీలో సీటు సాధించింది. పాఠశాలలో మెరిట్ ష్కాలర్‌షిప్ కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, రొబోటిక్ ల్యాబ్, బ్రీడ్ లైబ్రరీ, వొకేషనల్ ఎడ్యుకేషన్ వంటి ప్రత్యేకతలతో ఏటా కల్లూరు మోడల్ స్కూల్ ఉత్తమ ఫలితాలు సాధిస్తోంది.

అధ్యాపకుల సహకారం



విద్యార్థులపై అధ్యాపకులు ప్రత్యేక పర్యవేక్షణ తీసుకుంటారు. ప్రతిభ గల విద్యార్థులతోపాటు చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తారు. పరీక్షలకు సిద్ధం చేస్తారు. ఇందుకోసం తల్లిదండ్రులు సహకారం పూర్తిస్థాయిలో ఉంటోంది. అదుకోసమే ఏటా పది, ఇంటర్‌లో మంచిఫలితాలు సాధిస్తున్నాం.

– నర్సయ్య, ప్రిన్సిపాల్, కల్లూర్ మోడల్ స్కూల్

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

- జిల్లా అటవీ శాఖ అఖాధికారి వెంకటేశ్వర్‌రావు



అవగాహన కల్పిస్తున్న డీఎఫ్‌వో, సిబ్బంది

సారంగాపూర్(జగిత్యాల): పర్యావరణాన్ని కాపాడితేనే మానవ మనుగడ సాధ్యమని జిల్లా అటవీశాఖ అధికారి బి.వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక అటవీప్రాంతంలో పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖలను సమన్వయ పరిచి ప్రజలను చైతన్యవంతులను చేయాలన్న లక్ష్యంతో అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో 75 రకాల అంశాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడలనే లక్ష్యంతో ప్రపంచదేశాలు ఆలోచన చేస్తున్నాయని డీఎఫ్‌వో అన్నారు. ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఏటా మొక్కలు నాటడమే కాదు, నాటిన ప్రతీమొక్క బతకాలని అన్నారు. నీటి నిల్వలు పెంచడానికి కొత్తగా కుంటలు, డ్యాంలు నిర్మిస్తే సరిపోదని, ప్రతీనీటి చుక్కను వృథాగా పోకుండా కాపాడాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాల్లో తడి, పొడి ఉన్న వాటిని వేరుచేసి కంపోస్టుషెడ్లకు తరలించాలని సూచించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజర్ ప్రణీత్‌కౌర్, ఎఫ్ఎస్‌వో మహేష్, సర్పంచ్ రాజేంధర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపిపి రాంచంద్రారెడ్డి, బీట్ అధికారులు ప్రేమ్‌కుమార్, గోపాల్ తదితరులు ఉన్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

17 రోజుల్లోనే 36.200 మిలియన్ యూనిట్ల వినియోగం



జగిత్యాలరూరల్: భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు చల్లదనం కోరుకుంటున్నారు. ఫలితంగా ఏసీలు, కూలర్లు, మిక్సీల వినియోగం పెరుగుతోంది. తద్వారా రోజూ 2.300 మిలియన్ యూనిట్‌లకు పైగా విద్యుత్ ఖర్చవుతోందని అధికారులు చెబుతున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోవడంతో అదేస్థాయిలో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గత ఫిబ్రవరిలో.. వ్యవసాయ రంగానికి వినియోగించిన విద్యుత్ కలిపితే.. 128.952 మిలియన్ యూనిట్లు, మార్చిలో 150.228 మిలియన్ యూనిట్లు, ఏప్రిల్‌లో 102.574 మిలియన్ యూనిట్లు వినియోగించారు. ఈనెల 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కేవలం నివాసాలకే 36.200 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది.

ఎండల తీవ్రత కారణం..

- గత మార్చిలోనే 34 డిగ్రీల సెల్సియస్ వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.
- ఏప్రిల్‌లో మొదటి, రెండోవారంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో ప్రజలు వేడిని తట్టుకోలేదు.
- ఆ తర్వాత కొద్దిరోజులు అకాల వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడి కాస్త ఉపశమనం లభించింది.
- అయితే, మేలో ఎండలు మళ్లీ దంచికొడుతుండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది.

విద్యుత్ వినియోగం ఇలా..

జిల్లా వ్యాప్తంగా గురువారం ఒక్కరోజే సుమారు 2.307 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగించారని ఆ శాఖ అధికారులు ప్రకటించారు. ఈనెల ఒకటినుంచి ఈనెల 17వ తేదీ వరకు ఇళ్లలోనే సుమారు 36.200 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఖర్చయినట్లు అధికారులు వివరించారు.

ఈనెల ఒకటినుంచి 17వ తేదీ వరకు వినియోగించిన గృహ విద్యుత్ (మిలియన్ యూనిట్లలో)

తేదీ	విద్యుత్	తేదీ	విద్యుత్
1	1.494	9	2.033
2	1.669	10	2.11
3	1.663	11	2.188
4	1.764	12	2.14
5	1.783	13	2.081
6	1.915	14	2.205
7	1.988	15	2.233
8	2.133	16	2.249
		17	2.307

ఉక్కపోత ఎక్కువైంది

ఎండలు దంచికొడుతున్నాయి. వేడికి తట్టులేక పోతున్నాం. ఇంట్లో కూడా ఉక్కపోత ఎక్కువైంది. అందుకే కూలర్ వాడకం తప్పనిసరి అయింది. మధ్యాహ్నం, రాత్రి కూలర్ల వాడకం పెరిగింది.

– మారు గంగారెడ్డి, జాబితాపూర్

విద్యుత్ ఆదా చేయాలి

ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. నీరు, బొగ్గు, సూర్యరశ్మీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. అందరూ విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి.

– సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఎస్ఈ

రాయికల్‌లో భానుడి భగభగ



నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

రాయికల్(జగిత్యాల):పట్టణంలో శుక్రవారం 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పట్టణ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడూ రద్దీగా ఉండే స్థానిక ఆర్టీసీ పాతబస్టాండ్ ఎండ తీవ్రతకు ప్రయాణికులు లేక నిర్మానుష్యంగా మారింది.

చెత్త రహిత గ్రామాలు లక్ష్యం



వర్మికంపోస్ట్ షెడ్ పరిశీలిస్తున్న మకరంద్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): చెత్త రహిత గ్రామాలు లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘా సభ్యులు పనిచేయాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. మండల కేంద్రంలోని వైకుంఠ ధామం, వర్మీకంపోస్ట్ షెడ్, ఇంకుడుగుంతలు, కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇంటింటా ఇంకుడుగుంత తవ్వించాలని, తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా ఉండాలని చెప్పారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్త తరలించాలని అన్నారు. డీపీవో దేవరాజ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి శివాజీ, ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

మెట్‌పల్లి(కోరుట్ల): గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం చూపవద్దని అడిషనల్ కలెక్టర్ మకరంద్ సూచించారు. వెల్లుల్ల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పలుచోట్ల డ్రైనేజీలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతీ రోజు డ్రైనేజీలను శుభ్రం చేయాలని, ఖాళీస్థలాల్లో చెత్త పడేయకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతీరోజు సిబ్బంది ఇళ్లకు వెళ్లి చెత్త సేకరించాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ రజని, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిలో వింత చేష్టలు చేసిన వ్యక్తి అరెస్ట్

జగిత్యాలక్రైం: స్థానిక మోతెరోడ్డు శ్మశాన వాటికలో గురువారం రాత్రి వింతగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన పసుపులేటి సాయికృష్ణగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆరునెలలుగా మానసికస్థితి సరిగా లేక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇంట్లోంచి బయటకు వచ్చి శృశ్మశాన వాటికకు చేరుకున్నాడని అన్నారు. వింత చేష్టలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. యువకుడి తల్లి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేయడంతోపాటు కోర్టులో హాజరు పర్చి హైదరాబాద్‌లోని మానసిక వైద్యశాలకు తరలించనున్నట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు. ప్రజలు ఎలాంటి క్షుద్రపూజల వదంతులు నమ్మొద్దన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వెల్గటూర్(ధర్మపురి): ద్విచక్రవాహనం గేదెను ఢీ కొట్టి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన కప్పారావుపేట గ్రామంలో చోటు చేసుకుంది. కరీంనగర్‌కు చెందిన ఎం.అశోక్ కుమార్ లక్సెట్టిపేట నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా కప్పరావుపేట వద్ద రెండు గేదెలు రోడ్డుపై అడ్డు వచ్చాయి. వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనం పక్కకు తిప్పినప్పటికీ గేదెను ఢీ కొట్టి బైక్ అదుపుతప్పింది. ఈప్రమాదంలో కిందపడ్డ అతడి కాలు విరగడంతోపాటు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బట్టపల్లి గ్రామానికి చెందిన తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేయడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం.. బట్టపల్లి గ్రామానికి చెందిన సుమలతకు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తాళ్లపేట గ్రామానికి చెందిన రెడ్డిపాక రమేశ్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒకపాప ఉంది. వివాహ సమయంలో ఒప్పుకున్న మెర సుమలత కుటుంబ సభ్యులు రమేశ్‌కు కట్నకానుకలను ముట్టజెప్పారు. రమేశ్ కొంతకాలం జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషులు పలుమార్లు సయోధ్య కుదిర్చి సుమలతను కాపురానికి పంపించారు. అయినా రమేశ్‌లో మార్పు రాకపోగా సుమలతను అదనంగా రూ.2 లక్షలు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపరపల్లె గ్రామానికి చెందిన యాసం రాజయ్య (50) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందినట్లు ఏఎస్సై లక్ష్మీరాజం తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొలనూర్ గ్రామంలో గురువారం ఓ వ్యక్తి మృతిచెందగా రాజయ్య అక్కడికి వచ్చాడు. అంత్యక్రియలు ముగిశాక అతడు స్నానం చేసేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. శుక్రవారం మృతుడి భార్య మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

సాక్షి ఎఫెక్ట్..

జగిత్యాల: ఇంటర్ పరీక్షల ఇన్విజిలేషన్ విధులకు గైర్హాజరు కావడం, ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించడం కారణాలతో సారంగాపూర్ మండలం రేచపల్లి బీమ్‌రెడ్డి గూడెం ఎంపీపీఎస్‌లో ఎస్జీటీ వి.అనితను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులకు అధికారులు ఇన్విజిలేషన్ విధులు అప్పగించారు. వీరు మార్చి 14న రిలీవ్ అయి ఇంటర్మీడియెట్ నోడల్ అధికారికి రిపోర్ట్ చేసి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ పర్యవేక్షకులుగా వెళ్లారు. ఇందులో కొందరు అటు ఇన్విజిలేషన్‌కు వెళ్లకుండా, ఇటు పాఠశాల విధులకు హాజరు కాకుండా, కనీసం సీఎల్ వేసుకోకుండా జీతభత్యాలు సైతం పొందారు. ఈవిషయాలపై ఈనెల 13న 'ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు విచారణ ప్రారంభించారు. అయితే, డ్యూటీ సర్టిఫికెట్లు తనకు అందజేయాలని ఎంఈవో ఆదేశించగా, ఆ ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించారు. కానీ ఇందులో ఒక ఉపాధ్యాయురాలు ఫేక్ సర్టిఫికెట్ సమర్పించారు. ఈవిషయం వెలుగులోకి రావడంతో ఈనెల 16న 'ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్' శీర్షికన 'సాక్షి' మరో కథనం ప్రచురించింది. దీంతో డీఈవో జగన్మోహన్‌రెడ్డి రంగంలోకి దిగి పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈమేరకు ఎస్జీటీ వి.అనిత ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాకున్నా పాఠశాలలో జాయిన్ అయి ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్ సమర్పించి, జీతభత్యాలు పొందినట్లు రుజువైంది.

కొనసాగుతున్న విచారణ..

మరికొందరు ఉపాధ్యాయులు ఒకరోజు ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాలేదు. వీరిపై విచారణ కొనసాగిస్తున్నారు. గతంలోనూ వీరు అలాగే చేశారా? అనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.

మిల్లర్ల దోపిడీ అరికట్టాలి



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అడ్లూరిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గొల్లపల్లి(ధర్మపురి): మండలం కేంద్రంలో రైస్‌మిల్లర్లు 40 కిలోల బస్తాకు 3 కిలోల కోత విధిస్తూ రైతులను మోసం చేస్తున్నారని, వారి దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డు ఎదుట రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు లక్ష్మణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం డీసీవో రామానుజాచారి మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముస్కు నిశాంత్‌రెడ్డి, నాయకులు బీమా సంతోష్, రెవెల్ల సత్యనారయణగౌడ్, చీర్ల గంగాధర్, హరికిరణ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీధర్, రాజారావు, తిరుపతి, నేరెళ్ల మహేశ్, ప్రవీణ్, విక్రమ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యం నెరవేరితేనే పథకం విజయవంతం

- గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహాచారి



అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలిస్తున్న సీఆర్డీ అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహాచారి

సారంగాపూర్(జగిత్యాల): ప్రభుత్వం చేపట్టే కార్యక్రమం క్షేత్రస్థాయిలో లక్ష్యాన్ని చేరితే ఆ పథకం వందశాతం విజయవంతమైట్లని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ(సీఆర్డీ) అసిస్టెంట్ డైరెక్టర్ నర్సింహాచారి అన్నారు. స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా పెంబట్ల, సారంగాపూర్, బీర్‌పూర్ మండలం తుంగూర్, రేకులపల్లి గ్రామాల్లో పూర్తి చేసిన, ఇంయా చేయాల్సిన పనుల పురోగతిపై ఆయన అధికారులతో శుక్రవారం సమీక్షించారు. వైకుంఠధామాలు, కంపోస్టుషెడ్లు, ఇంకుడు గుంతలు, హరితహారం మొక్కల పెంపకం, పారిశుధ్యం నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం తదితర అంశాలపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సారంగాపూర్‌లో రోడ్డు వెంట నాటిన మామిడి మొక్కల ఎదుగుదలపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని ఆయన అభినందించారు. ఆయన వెంట డీఎల్‌పీవో కనకదుర్గ, ఎంపీడీఓవ మాల్లారెడ్డి, ఎంపీవోలు శశికుమార్‌రెడ్డి, ఏపీకే రాజు, సర్పంచులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, బొడ్డుపల్లి రాజన్న, ఎలగందుల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లైశెట్టి శేఖర్, సంతోష్ తదితరులు ఉన్నారు.